క్లుప్తంగా

కారుణ్య నియామక పత్రాలు అందజేత

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన నలుగురు పిల్లలకు కారుణ్య నియామక పత్రాలను ఏరియా జీఎం దుర్గం రామచందర్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం దొరకడం గొప్ప అదృష్టమన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిబద్ధతతో, అంకితభావంలో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం నియామకపత్రాలు అందుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం ఈసం కృష్ణయ్య, డీజీఎం(పర్సనల్) రమేష్, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, మణుగూరు ఓసీ రక్షణ అధికారి భాస్కర్, డివైఎస్ఈ రాజేంద్రప్రసాద్, సినియర్ పీఓ వి.రామేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనాలతో మహిళలు..

అశ్వాపురం: ఏకాదశి ఆషాఢ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో షిర్డీ సాయిబాబా ఆలయంలో బోనాల పండుగను గురువారం మహిళలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా మేళతాళాలతో ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయిబాబా ఆలయంలో గద్దల వెంకటేశ్వర్లు దంపతులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యప్రకాష్, గద్దల రామకృష్ణ, ఇసంపల్లి కృష్ణ, నరసింహారావు, కొడారి వెంకటేశ్వర్లు, మడిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అరవై శాతం ఉద్యోగాలు ఇవ్వాలి

అశ్వాపురం: ఐటీసీ పీఎస్‌పీడీ ఎనిమిదో ప్లాంటు విస్తరణలో స్థానిక నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రతి ఏడాది ఆరవై శాతం ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో టీజేఎస్ జిల్లా నాయకులు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, పిప్పళ్ల శ్రీనివాస్, రాఘవులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ మిషన్‌పై అవగాహన



ఈవీఎం ద్వారా ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న డీటీ సుచరిత

అశ్వారావుపేటరూరల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై గురువారం అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డెమో ఓటింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ మిషన్ ద్వారా ఓటు హక్కు వినియోగం గురించి ఓటర్లను డీటీ సుచరిత ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకునే వారు ఈ అవకాశాన్ని సదినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ లూథర్ విల్సన్ కోరారు.

నిర్మాణ పనులు పరిశీలన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్ అన్నారు. గురువారం మొండికుంటలో నిర్మాణం పూర్తి ఐన సీసీ రోడ్ల నిర్మాణాలను సర్పంచ్, ఉపసర్పంచ్ పరిశీలించారు.

అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో సుమారు రూ.70 లక్షలతో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో అంతర్గత రహదారులు నిర్మించామన్నారు. గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి డ్రైయినేజీ సమస్య పరిష్కారానికి కోటి రూపాయలతో నిర్మాణం జరుగుతోందన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో పాఠశాల రూపురేఖలు మారాయన్నారు. త్వరలోనే గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో సుమారు రూ.30 లక్షలతో మరి కొన్ని సీసీరోడ్లు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుండపోతకు అతలాకుతలం

- పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- పోటెత్తిన వరదనీరు, తప్పని అవస్థలు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు



అశ్వారావుపేటరూరల్: లోతట్టు ప్రాంతాల్లో పోటెత్తిన వరదనీరు



అన్నపురెడ్డిపల్లి: అబ్బుగూడెం-కట్టుగూడెం రహదారిపై ప్రవహిస్తున్న నీరు

అశ్వారావుపేటరూరల్: తెల్లవారుజాము నుంచి అశ్వారావుపేట మండల వ్యాప్తంగా గురువారం కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో 10.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షంతో మండల కేంద్రంలోని మద్దిరావమ్మ సెంటర్, గౌడ బజారు, వడ్డెర బజారు, గాంధీబొమ్మ సెంటర్, దొంతికుంట, పేటమాలపల్లి, కొనేరుబజారులో కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. పెద్ద స్థాయిలో వరద నీరు ప్రవహించడంతో ఆయా ప్రాంతాల్లోగల లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయింది. ప్రధాన రహదారులు, సీసీ రోడ్లు నీట మునిగిపోయాయి. అదే విధంగా మండలంలోని ఊట్లపల్లి సమీపంలోగల వెంకమ్మ చెరువు నిండిపోగా, అలుగు పారింది. దాంతో దిగువలో ఉన్న వాగొడ్డుగూడెం వద్ద వాగు ఉప్పొంగి, చప్టాపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అదే విధంగా మండలంలోని వేదాంతపురం గ్రామంలోని రామాలయం, ప్రభుత్వ పాఠశాల, ఓ గుడిసె, సీసీ రోడ్లు, ప్రధాన రహదారి జలమయం అయ్యాయి. దాంతో స్థానికులు అవస్థలు పడ్డారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 47.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి వరద నీరు రోడ్లపై చేరింది. చెరువులకు, కుంటల్లోకి భారీగా నీరు చేరి జలకళను సంతరించుకున్నాయి. మండల పరిధిలోని బుచ్చన్నగూడెం గ్రామంలోని నర్సపాలెం చెరువు పూర్తిగా నిండి మత్తడి పోస్తోంది. మండల కేంద్రంలోని సత్రం వెనక ఇళ్లలోకి వరద నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. అబ్బుగూడెం-కట్టుగూడెం రహదారిలోని ఈదుల వాగు వరద రహదారిపై ప్రవహించింది.

రైతుల మోముపై హర్షం

చంద్రుగొండ: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటి నుంచి భారీ పడిన మొదటి వర్షం ఇదే. పంటలకు జీవం పోసేలా వర్షం పడటంతో రైతుల మోములో ఆనందం వెల్లివెరిసింది. భారీ వర్షానికి చెరువుల్లో నీరు చేరుతుండటంతో జలకళ కనిపిస్తోంది. ఇదిలాఉండగా ఒక్కసారిగా భారీ వర్షం పడటంతో చంద్రుగొండలోని జూలూరుపాడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ళల్లో, అయన్నపాలెం, రావికంపాడు గ్రామాల్లోని లోతట్టు ఇళ్లల్లోకి వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరాయి. దీంతో బాధితులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. చంద్రుగొండలో పంచాయతీ పాలకవర్గం సత్వరమే స్పందించి జేసీబీతో తాత్కాలికంగా కాలువలు తీయించి వర్షపునీరు బయటకు వెళ్లేలా చేశారు. డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతోనే లోతట్టుప్రాంల్లో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చెరువుల్లో జలకళ

దమ్మపేట: మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో, మండల పరిధిలోని చెరువులు నీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి మండలంలోని చెరువులు, కుంటలు, వరి పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి. మండలంలో ఒక్కసారిగా భారీ వర్షపాతం నమోదు కావడంతో, వరి విత్తనాలు విత్తిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, పొలాల్లో దమ్ములు చేయించి, నాటు వేయడానికి సిద్ధం అయ్యారు.



అశ్వారావుపేటరూరల్: వేదాంతపురంలో నీట మునిగిన రహదారి



దమ్మపేట: నీటితో నిండిన పేరంటాల చెరువు



అశ్వారావుపేటరూరల్: పేటమాలపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలిచిన వరదనీరు

వరదలపై అప్రమత్తంగా వ్యవహరించాలి

చర్ల: వర్షాలు, వరదల పట్ల మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎవరికి కేటాయించిన స్థానంలో వారు తప్పకుండా ఉండాలని తహసీల్దార్ బి.భరణిబాబు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గోదావరి ముంపు ప్రాంతాల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గత ఏడాది వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని అప్పుడు వ్యవహరించిన విధంగానే వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సూచించారు. వర్షాలు, వరదల సందర్భంలో ప్రజలను అప్రమత్తం చేయడం, ఆస్తి, ప్రాణనష్టాలు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవడం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించడం, వారికి తాగునీరు, ఆహార పదార్థాలు అందించడం వంటి కార్యాకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన సూచించారు. ముంపు ప్రాంత గ్రామాలలకు సంబంధించి రేషన్ సిద్ధంగా ఉంచామన్నారు. సమావేశంలో ఎంపీపీ గీదా కోదండ రామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భరణిబాబు

అధ్వానంగా పాఠశాల ఆవరణ

అశ్వాపురం: మండల కేంద్రంలోని అశ్వాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణ అధ్వానంగా ఉండి చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం కురిసినా పాఠశాలలో బోరింగు వద్ద నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. తాగునీటి కోసం, భోజనం సమయంలో ప్లేట్లు కడగడం కోసం ఈ బోరింగ్ వద్దకే రావాల్సి ఉంటుంది. ఆ సమయంలో చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. పాఠశాల అపరిశుభ్రంగా ఉండి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాఠశాల బోరు వద్ద బురదలో అవస్థలు పడుతున్న చిన్నారులు

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



భద్రాచలం: రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బాలసాని, బీఆర్ఎస్ నాయకులు



చర్ల: విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

భద్రాచలం: రైతులకు 3 గంటల విద్యుత్ చాలంటూ రైతాంగాన్ని కించపరిచే విధంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని, ఆయన రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలసాని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం భద్రాచలంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు 24 గంటలను ఇచ్చింది నాటి ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డినేనని, కానీ ఆ గొప్పతనం కాంగ్రెస్‌ది కాదన్నారు. ఇదే నిజమైతే అనంతరం పాలించిన కాంగ్రెస్ సీఎంలు దానిని ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. అనంతరం చర్ల రోడ్డులో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ, నాయకులు బోదెబోయిన బుచ్చయ్య, తిప్పన సిద్దులు, యశోద నగేష్, రవికుమార్, బల్ల రాంబాబు, ఎల్‌వీ పాల్గొన్నారు.

చర్ల: రైతులకు ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం చర్లలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డి తాతారావు, తడికల లాలయ్య, తోటమల్ల వరప్రసాద్, ఎస్‌డి.అజీజ్, లంకరాజు, అనీల్, రాము, పంజా రాజు, రాజబాబు, నర్సింహారావు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

బూర్గంపాడు: కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు గాను అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ నెల 31వ తేదీలోపు ఐటీఐలో చేరాలనుకునే వారు తమ ధ్రువీకరణ ప్రతాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి పాసై అగస్ట్ 1వ తేదీ నాటికి 14 ఏళ్ల నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మహిళలకు రక్షణ కరువు

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి రోజూ ఏదో ఒకచోట మహిళలపై ప్రత్యేక్షంగా కాని పరోక్షంగా కాని దాడులు జరుగుతున్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని బహుజన సమాజ్ పార్టీ మహిళ విభాగం మండల ప్రధాన కార్యదర్శి పెద్దపాటి కామాక్షి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మహిళలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆరోపించారు. మహిళల రక్షణ కోసం వచ్చే ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

కరకగూడెం: ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో భంగపాటు తప్పదని టీడీపీ పినపాక నియోజకవర్గ నాయకులు చందా మధు విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం చిరుమల్ల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు వెంటనే రుణమాఫీ చేసి ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులకు డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాలన్నారు.

విద్యార్థినులకు అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన ఎన్‌జీఓ 'వాయిస్ ఫర్ గర్ల్స్'–ఐటీడీఏ భద్రాచలం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను గురువారం నిర్వహించారు. బాలికలు చైతన్యం చెందితే ప్రపంచాన్ని శాశించే స్థాయికి భారతదేశం చేరుకుంటుందన్న ధ్యేయంతో 10 రోజుల పాటు ఈ అవగాహన తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో ఆరోగ్యం, భద్రత, హక్కులు, భవిష్యత్ కార్యచరణలను వివరిస్తారు. బాల్య వివాహాలు, ఆర్థిక, సామాజిక, లింగ అసమానతలు నిర్మూలించి.. ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఈ తరగతులు ఏర్పాటు చేశారు. ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రూ ఆదేశాల మేరకు ఏపీఓ డేవిడ్‌రాజ్ పర్యవేక్షణలో జీసీడీఓ అలివేలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ తరగతులను నిర్వహిస్తున్నారు.

ప్రతీ పేదవాడికి పథకాలు అందాలి

మణుగూరురూరల్: ప్రతీ పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అధికారులకు సూచించారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన పినపాక నియోజకవర్గంలోని అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్ పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పనుల త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల నిర్వహణలో అలసత్వం వహించొద్దని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, తహసీల్దార్ కె.నాగరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావులతో పాటు మిగతా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ, ఇంజనీరింగ్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో మేలు..

కరకగూడెం: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం కుర్నవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంట సాగుతో 430 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చని, ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలని అన్నారు. వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు తదితర అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. బ్యాంకుల ద్వారా రుణ సాయం అందుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న విప్ రేగా కాంతారావు

ఉత్పత్తి లక్ష్య సాధనలో రక్షణే ప్రథమం

మణుగూరురూరల్: బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్య సాధనలో రక్షణే ప్రథమమని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా రక్షణ అధికారి జేవీ రమణ తెలిపారు. గురువారం ఓసీ–2లో పీకేఓసీ రక్షణ విభాగం ఆధ్వర్యంలో కార్మికులకు రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా రక్షణ అధికారి జేవీ రమణ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు రక్షణపై అవగాహన కల్పించారు. ప్రతీ కార్మికుడు.. 'భద్రత నా బాధ్యత' అనే నినాదంతో పని చేయాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని సూచించారు. అనంతరం కార్మికులందరితో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పీకేఓసీ ప్రాజెక్ట్ మేనేజర్ దండమూడి రాంబాబు, గని మేనేజర్ కె సురేష్‌కుమార్, అధికారులు జి శంకర్, భాంగ్య, రాందాస్, బాబ్జీ, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుకుమార్, కిరణ్, టీబీజీకేఎస్ నాయకులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా రక్షణ అధికారి జేవీ రమణ

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి

గుండాల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాభివృద్ధి జరిగిందని, మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జరుతుందుని పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా నాయకురాలు పోలేబోయిన శ్రీవాణి అన్నారు. పార్టీ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 13వ రోజు గుండాల మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సారి కాంగ్రెస్ అధికారంలో వస్తే పంఛన్ రూ.4 వేలు, ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, రెండు లక్షల రుణమాఫీ, కౌలు రైతుకు రూ.15 వేలు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, యువతీ యువకులకు రెండు లక్షల ఉద్యోగాలు, గిట్టుబాటు ధర, ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. సాయనపల్లి ఎంపీటీసీ కల్తి కృష్ణారావు, శంభూనిగూడెం సర్పంచ్ ఈసం సుధాకర్, మండల నాయకులు పొంబోయిన ముత్తయ్య, మండల యూత్ అధ్యక్షుడు, ఎన్ఎస్‌యూఐ నాయకులు బొబ్బిలి పవన్ కల్యాణ్, ఈసం రాజబాబు, డిల్లి వసంత్, బచ్చల రాజు, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీకి ఐటీసీ సహకరించాలి



శ్యాంకిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఐటీసీ పీఎస్‌పీడీ సహకరించాలని సర్పంచ్ కాకా అశోక్, ఉపసర్పంచ్ సురేష్‌రెడ్డి, గ్రామస్తులు మొగిళ్ల వీరారెడ్డి, పగడాల రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఐటీసీ హెచ్‌ఆర్ డీజీఎం శ్యాంకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఐటీసీ ఏర్పడిన నాటి నుండి తమ గ్రామ పంచాయతీకి ఎలాంటి సహకారాలు అందించలేదని అన్నారు. గ్రామపంచాయతీని దత్తత తీసుకుని గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ, కమ్యూనిటీ హాలు, మినీ ఆరోగ్య హెల్త్ సెంటర్, వెటర్నరి ఆస్పత్రి భవనం, రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు, మినీ అంగన్‌వాడీ భవనం వంటి మౌలిక సదుపాయాలు కల్పించి.. పిల్లలకు బుక్స్, స్టేషనరీ, మెయింటినెన్స్, గ్రామంలో నెలకు రెండు సార్లు హెల్త్ క్యాంపులు, మినీ వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని పార్టీల నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతును తెలిపారు. మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: పట్టణంలో వర్షంలోనూ ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు



అశ్వారావుపేటరూరల్: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



మణుగూరురూరల్: మాట్లాడుతున్న సీపీఐ నాయకులు



చర్ల: చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుని ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు